నైట్ డ్యూటీ చేస్తాడు గనుక తన గదికున్న తాళాన్ని తెరుస్తాడు. తనని తూర్పు వేపు గోడనెక్కి పారిపొమ్మని అతడి వుద్దేశ్యం.

x x x x

ఠాణాలో మూడు గంటలు కొట్టేరు.

కనకయ్య పడుకున్న వాడల్లా చువ్వలా లేచి కూర్చున్నాడు. యుద్ధాని కెళ్ళబోతున్న సైనికుడిలా మొండిధైర్యంతో తంగవేలు బూట్ల శబ్దం కోసం చెవులు నిక్కరించి వింటూ ఎదురు చూడసాగేడు. తంగవేలు రానేవచ్చాడు. కాని అతడి కాళ్ళకి బూట్లులేవు. ఏ విధమైన చప్పుడు, సందడి లేకుండా దొంగలా వచ్చాడు. కనకయ్య లేచి నిలబడి బల్లిలా గోడనానుకు నిల్చు న్నాడు. తంగవేలు మెకుకువుగా, శబ్దం కాకుండా తాళాన్ని తీసి తలుపుని కొద్దిగా నెట్టేడు.

ఏదో జేబులోంచి తీసేడు తంగవేలు. కనకయ్య భయంతో కదలిక లేకుండా అలానే నిల్చున్నాడు, అతడు జేబులోంచి తీసిన వస్తువుని కనకయ్య చేతిలో వుంచి, నిశ్శబ్దంగా తప్పుకున్నాడు.

కనకయ్య గది మధ్యగావచ్చి అతడిచ్చినదాన్ని కళ్ళదగ్గరగా వుంచు కొని చూసేడు.

యాభై రూపాయల కాగితం!

అది చూసేక అతని గొంతులో బాధ గరగరమంది. ఊహించని అప్యాయతకి మనస్సు కదిలి, కళ్లు మూసుకున్నాడు- ఏడ్చేందుకిది సమయం కాదన్నట్లు.

x x x x

ఇంకా తెల్లరారటానికి కొద్ది గంటలే వుంది. జైల్లోంచి బయటపడ్డ కనకయ్య చకచకాలేని ఓపిక తెచ్చుకుని నడుస్తున్నాడు. తెల్లవారకమునుపే చుట్టుప్రక్కలవాళ్లు నిద్రలేవక ముందే శాలినీని తీసుకొని బయల్దేరాలి. ముఖ్యమైన సామాన్లు, శాలినితో రైల్వేస్టేషను కెళ్ళి ఏ రైలు తయారుగా వుంటే దాంట్లోకి జొరబడి, తర్వాత మిగిలిన ఆలోచన చెయ్యాలి.

